

డ(ద)యాలసిస్ సేవలు..!
జిల్లాలో మారుమూలన ఉన్న గుండాల మండల కేంద్రంలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. 8లో



ఇక నిశ్చింతగా ఉండేలా..
గురుకులాల్లో విద్యార్థుల యోగక్షేమాలు తల్లిదండ్రులకు చేరవేసేందుకు ఫోన్‌మిత్ర సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
36° / 27°

వాతావరణం
జిల్లాలో సోమవారం ఉదయం చల్లగాలులు వీచే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరగవచ్చు.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి స్వామివారిని పల్లకీ సేవగా చిత్రకూట మండపానికి తీసుకొచ్చారు. ఆ తర్వాత అర్చకులు స్వామివార్లకు విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. కంకణధారణ, యజ్ఞోపవేత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

పెద్దమ్మతల్లికి విశేషపూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అర్చకులు అమ్మవారికి విశేష పూజలు జరపగా, క్యూలైన్ ద్వారా భక్తులు దర్శించుకున్నారు. అనంతరం అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నేడు రుద్రహోమం

పెద్దమ్మతల్లి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా సోమవారం రుద్రహోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమంలో పాల్గొనే భక్తులు రూ.1,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని, వివరాలకు 6303408458లో సంప్రదించాలని కోరారు.

నేడు ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై లిఖిత పూర్వకంగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

భద్రాచలంలో గిరిజన దర్బార్..

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ పీఓ బి. రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే దర్బార్‌లో గిరిజనులు తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేయాలని పేర్కొన్నారు.

దూరవిద్యలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్ : కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (గత ఎస్‌డీఎల్‌సీఈ)లో 2025 – 26లో డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ టి.గోపి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన చేశారు. జూలై 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 80088 11998 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మట్టి ఇటుకలకు గట్టి ప్రయత్నం..



సండే బ్రిక్స్ చాలెంజ్‌లో పాల్గొన్న ఔత్సాహికులు

సండే సందడిగా బ్రిక్స్ చాలెంజ్ పోటీలు

- తక్కువ వ్యయంతో మట్టి ఇటుకల తయారీపై అవగాహన
- ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, యువకుల భాగస్వామ్యం



తయారు చేసిన మట్టి ఇటుకలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా కేంద్రంలోని ప్రగతి మైదానంలో ఆదివారం నిర్వహించిన సండే బ్రిక్స్ చాలెంజ్ పోటీలు ఆద్యంతం ఉల్లాసంగా...ఉత్సాహంగా జరిగాయి. విద్యార్థులు, యువత మొదలు వృద్ధుల వరకు పోటీల్లో భాగస్వాములయ్యారు. పర్యావరణహిత మట్టి ఇటుకలపై ప్రజలలో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ పోటీలను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, శారీరక శ్రమకు ప్రోత్సాహం, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బెంగళూరుకు చెందిన సీఎస్ఈవీ నిపుణుడు సుధాకర్‌రెడ్డి మట్టి ఇటుకల తయారీ విధానంపై అవగాహన కల్పించారు. 60 శాతం మట్టి, 20 శాతం ఇసుక, 10 శాతం సిమెంట్, పది శాతం సున్నం కలిపిన మిశ్రమంతో యంత్రం ద్వారా ఇటుకలను తయారు చేశారు.

దృఢ సంకల్పంతో...
కలెక్టర్ జితేష్ వి.పాటిల్

బ్రిక్స్ చాలెంజ్ కార్యక్రమం పోటీ మాత్రమే కాదని సంప్రదాయ, దృఢ సంకల్పమని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, ప్రజలు పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లాలో ఎర్రమట్టి పుష్కలంగా లభిస్తుందని, సిమెంట్, ఇసుక, సున్నం కలిపి ఇటుకలు తయారు చేస్తే దృఢంగా ఉంటాయని, కాల్చిన ఇటుకలకు ధీటుగా ఉంటాయని వివరించారు. బెంగళూరు వంటి నగరాల్లో ధనవంతులు ఉదయం వ్యాయామంగా మట్టి ఇటుకలను తయారుచేసి సొంత ఇంటిని నిర్మించుకుంటున్నారని తెలిపారు. మట్టి ఇటుకలతో జిల్లావ్యాప్తంగా పాఠశాలల ప్రహరీలు, మరుగుదొడ్లు, వంటషెడ్లు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు కలెక్టర్ క్యాప్‌లు, టీ షర్ట్‌లు బహూకరించారు. విద్యాశాఖ కోఆర్డినేటర్ సైదులు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, జిల్లా యువజన, క్రీడల శాఖాధికారి పరంధామరెడ్డి, డీఈఓ వెంకటేశ్వరాచారి, విద్యాశాఖ కో ఆర్డినేటర్ నాగ రాజశేఖర్, డీఆర్డీఏ, మెప్మా అధికారులు, మున్సిపల్ సిబ్బంది, వాకర్లు, విద్యార్థులు, క్రీడాకారులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో..

సండే బ్రిక్స్ చాలెంజ్ పోటీల్లో వివిధ ప్రభుత్వ శాఖలు పాలుపంచుకున్నాయి. జిల్లా యువజన, క్రీడల శాఖ ముఖ్యపాత్ర పోషించగా, డీఎస్‌డీఓ నుంచి 75 మంది, టీఎన్‌జీఓ 50, మెప్మా 40, డీఆర్‌డీఏ 40, ఇతరులు 125, విద్యా విభాగం 155, ఈజీఎస్ 100, సెర్ప్ విభాగంలో 50 మంది పోటీల్లో పాల్గొన్నారు. ఆశించిన స్థాయిలో ఆయా శాఖలు భాగస్వామ్యం కాకపోయినా పలువురు క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, మున్సిపల్ అధికారుల చొరవతో పోటీలు విజయవంతమయ్యాయి. ఇటుకల తయారీకి అవసరమైన మెటీరియల్‌ను కొత్తగూడెం మున్సిపల్ అధికారులు, సిబ్బంది అందించారు.



యంత్రంలో మిశ్రమాన్ని పోస్తున్న కలెక్టర్ జితేష్

దృఢమైన నిర్మాణాలు..



మట్టి ఇటుకలతో నిర్మాణాలు దృఢంగా ఉండటంతోపాటు పర్యావరణానికి మేలు చేస్తాయి. ప్లాస్టింగ్ అవసరం ఉండదు. వీటితో నిర్మించే ఇంట్లో వేసవిలో చల్లదనం ఉంటుంది. సాధారణ ఇటుకలతో పోలిస్తే తయారీ తేలిక, ఖర్చు తక్కువ. దీని ద్వారా ఉపాధీ పొందవచ్చు.
–సుధాకర్‌రెడ్డి, బెంగళూరు సీఎస్ఈవీ నిపుణుడు

ప్రాధాన్యత తెలిసింది



పర్యావరణహిత మట్టి ఇటుకల ప్రాధాన్యం తెలిసింది. మట్టి ఇటుకల తయారీపై మా పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తాను. నిర్మాణాల్లో వినియోగించే విధంగా కృషి చేస్తాను. –నాగలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయురాలు, టేకులపల్లి

యువతకు ఉపాధి



మా కరాటే విద్యార్థులు చాలా మంది పాల్గొన్నారు. వారి ఇళ్లలో తయారీకి ప్రయత్నిస్తారు. దృఢమైన నిర్మాణాలకు మట్టి ఇటుకలను ఉపయోగించుకునేలా ప్రజలకు మా తరఫున అవగాహన కల్పిస్తాం.
– పంతంగి సాయి నిరంజన్, కరాటే కోచ్

అవగాహన కలిగింది



సండే బ్రిక్స్ చాలెంజ్‌లో పాల్గొనడం ద్వారా మట్టి ఇటుకల తయారు చేసే పద్ధతి తెలిసింది. తోటి విద్యార్థులతో ఈ అనుభవాన్ని, ప్రాధాన్యతను పంచుకుంటాను. చాలా మంచి కార్యక్రమం.
– ఓ.ఇందు, ఇంటర్ విద్యార్థిని, సింగరేణి మహిళా కళాశాల

మాడవీధుల విస్తరణకు చిక్కుముడి

- భద్రాచల రామాలయ అభివృద్ధికి ఆటంకం!
- స్థలాలు ఇచ్చేందుకు అంగీకరించని రెండు కుటుంబాలు
- భూ సేకరణ పూర్తయితేనే పనులు ప్రారంభం



మాడ వీధుల విస్తరణలో కూల్చివేయని భవనాలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానం అభివృద్ధికి చేపట్టిన మాడ వీధుల విస్తరణకు అడ్డు తొలగడం లేదు. దాదాపు అందరూ ఖాళీ చేసినా ఓ రెండు కుటుంబాల పేచీతో భూ సేకరణ పూర్తి కాలేదు. భూ సేకరణ పూర్తయితేనే రామాలయ అభివృద్ధి పనులు ముందుకు సాగుతాయి. దీంతో భక్తులకు ఎదురుచూపులు తప్పడంలేదు.

మేము నష్టపోయామంటున్న నిర్వాసితులు

ప్రభుత్వంపై నమ్మకంతో రామాలయ అభివృద్ధికి సహకరించేందుకు ఆలయానికి పడమర, దక్షిణం వైపున ఉన్న చిరు వ్యాపారులు, ఇళ్ల యజమానులు గత నెల 10వ తేదీ తర్వాత ఖాళీ చేశారు. నష్టపరిహారం పూర్తిగా అందించలేదని, ప్రత్యామ్నాయ ఇంటి స్థలం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తూనే తమ నివాసాలను ఖాళీ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు. వారు జేసీబీలతో ఇళ్లను కూల్చేశారు. నెల రోజులు దాటినా ఇతర ఇళ్లను ఖాళీ చేయించలేదు. దీంతో తాము వ్యాపారం నష్టపోయామని ఖాళీ చేసిన నిర్వాసితులు పేర్కొంటున్నారు.

పుష్కరాల నాటికైనా అవుతాయా..?

రామాలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని అంటున్నా ప్రభుత్వ చిత్తశుద్ధిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సుమారు 18 నెలలు కావొస్తున్నా అభివృద్ధిలో కీలక ఘట్టమైన మాడ వీధుల విస్తరణ భూ సేకరణకే నెలలపాటు సమయం తీసుకోవడంపై భక్తులు పెదవి విరుస్తున్నారు. భూ సేకరణ పూర్తయి, మాస్టర్ ప్లాన్‌ను ప్రభుత్వం ఆమోదించి, విడతల వారీగా బడ్జెట్ విడుదలైతేనే పనులు పూర్తవుతాయి. ఆ పనులన్నీ అయ్యేదెప్పుడు.. ఆలయం అభివృద్ధి చెందేదెప్పుడనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. కనీసం గోదావరి పుష్కరాల నాటికైనా ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేస్తారా అని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి భూ సేకరణ పూర్తి చేసి నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.

రెండు కుటుంబాలతోనే సమస్య

రామాలయ అభివృద్ధికి ప్రధానమైన మాడ వీధుల విస్తరణపై ప్రభుత్వం తొలుత దృష్టి సారించింది. 40 ఇళ్లను తొలగించాలని నిర్ణయించిన అధికారులు సంప్రదింపులు జరిపి 32 మందికి నష్టపరిహారం కొంత అందజేశారు. ఇళ్లు తొలగించారు. ఆ తర్వాత మరికొంత పరిహారం చెల్లించగా ఇంకా సుమారు 25 శాతం పరిహారం చెల్లించాల్సి ఉంది. ప్రత్యామ్నాయ ఇంటి స్థలాన్ని కూడా చూపించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో దాదాపు అందరూ ఖాళీ చేసినా రెండు కుటుంబాలకు చెందిన ఎనిమిది మంది మాత్రం ససేమిరా అంటున్నారు. ఆలయంలో పనిచేసే ఓ ప్రధానార్చకుడితోపాటు కొందరు వ్యాపారులు అంగీకరించడం లేదు. రోడ్లు భవనాల శాఖ నిర్దేశించిన మేర కాకుండా పెద్ద మొత్తంలో నష్టపరిహారాన్ని వారు ఆశిస్తున్నట్లు తెలిసింది. చివరకు రెవెన్యూ అధికారులు 2013 చట్టం ప్రకారం ఇవ్వడానికి అంగీకరించినా అది కూడా సరిపోదంటూ వారు కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. ఇటు రెవెన్యూ అధికారులు సైతం సీసీఎల్ కోర్టును ఆశ్రయించనున్నట్లు తెలుస్తోంది. న్యాయస్థానం ఆదేశాల ప్రకారం నష్టపరిహారాన్ని కోర్టులో డిపాజిట్ చేసి ఆ ఇళ్లను సైతం స్వాధీనం చేసుకునే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

సింగరేణిలో పలువురు అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో వివిధ ఏరియాల్లో పనిచేస్తున్న ఆరుగురు ఫారెస్ట్ ఆఫీసర్లను బదిలీ చేస్తూ ఆదివారం యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగూడెం–ఇల్లెందు ఏరియాల డీజీఎం ఏబీ హరినారాయణను శ్రీరాంపూర్ ఏరియాకు, మందమర్రి ఏరియా ఫారెస్ట్ మేనేజర్ ఆర్వీ రమణమూర్తిని కొత్తగూడెం–ఇల్లెందు ఏరియాలకు, ఆర్జీ–3 ఏరియా జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ బోడెపూడి కళ్యాణ్‌ను మణుగూరు ఏరియాకు, ఆర్జీ–2 ఏరియా ఫారెస్ట్ ఆఫీసర్ ఆర్.నవీన్‌కుమార్‌ను మందమర్రి ఏరియాకు, శ్రీరాంపూర్ ఏరియా జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ కే.మేఘనను ఆర్జీ–3 ఏరియాకు, కార్పొరేట్ ఏరియా జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ కే. సుస్మాలక్ష్మిని బెల్లంపల్లి ఏరియాకు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ముగ్గురు సర్వే ఆఫీసర్లను బదిలీ చేస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. కార్పొరేట్ సర్వే సూపరింటెండెంట్ డి.వెంకటేశ్వర్లును కొత్తగూడెం ఏరియాకు, అడ్రియాల ప్రాజెక్ట్ సూపరింటెండెంట్ నారాయణను ఆర్జీ–1 ఏరియాకు, ఆర్జీ–1 ఏరియా డిప్యూటీ సూపరింటెండెంట్ యశోద హనుమంతులును అడ్రియాల ప్రాజెక్ట్‌కు బదిలీ చేసింది. ఈ నెల 30న వారికి కేటాయించిన ఏరియాల్లో విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

మొరాయించిన స్పీడ్ బోటు

కిన్నెరసాని జలాశయం మధ్యలో పర్యాటకుల ఆందోళన



కిన్నెరసాని జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: పర్యాటకులు ఆదివారం జల విహారం చేస్తుండగా స్పీడ్ బోటు కిన్నెరసాని రిజర్వాయర్ మధ్యలో మొరాయించింది. జలాశయంలో మొసళ్ల సంచారం ఉండటంతో పర్యాటకులు తీవ్ర ఆందోళన చెందారు. నెల క్రితమే బోటుకు మరమ్మతులు చేపట్టినా ఇంజన్‌లో సాంకేతిక లోపం తలెత్తి నిలిచిపోయింది. డ్రైవర్ మరమ్మతులు నిర్వహించగా తిరిగి స్టార్ట్ కావడంతో పర్యాటకులు ఊపిరి పీల్చుకున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

బోటింగ్ పాయింట్ వద్ద టూరిజం కార్పొరేషన్ మేనేజర్ నిత్యం పర్యాటకుల భద్రతను పర్యవేక్షిస్తుంటారు. ఆదివారం మేనేజర్ విధులకు రాలేదు. స్పీడ్ బోటు జలాశయం మధ్యలో నిలిచిపోవడంతో బోటింగ్ సమస్యపై ఎవరికీ ఫిర్యాదు చేయాలో అర్థం కాలేదని పలువురు పర్యాటకులు పేర్కొంటున్నారు. అనంతరం కొందరు ఏజీఎంకు సమస్యను విన్నవించారు. ఈ విషయమై మేనేజర్ దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా.. అనారోగ్య సమస్యలతో విధులకు రాలేదని తెలిపారు.

ఒక రోజు ఆదాయం రూ. 50 వేలు...

కిన్నెరసానికి పర్యాటకల రాకతో ఆదివారం ఒక్క రోజు రూ. 50 వేల ఆదాయం సమకూరింది. రాష్ట్రంలోని పలుప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన సందర్శకులు డ్యామ్, జలాశయం, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. ప్రకృతి అందాలను ఆస్వాదించారు. 684 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.36,090 ఆదాయం లభించింది. 250 మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.14,040 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఇంకెన్నాళ్లకు 'లిఫ్ట్' ఇస్తారు?

- నత్తనడకన ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణ పనులు
- 208–19లో మూడు పథకాలకు రూ.29.64 కోట్లు మంజూరు
- ఇంకా పూర్తికాని నాగారం, సూరారం లిఫ్ట్‌ల పనులు
- సాగునీటి కోసం ఎదురుచూస్తున్న ఆయకట్టు రైతులు



నిరుపయోగంగా మారిన సూరారం లిఫ్ట్ (ఇన్‌సెట్) నాగారం లిఫ్ట్ కోసం తవ్విన బావి

పాల్వంచరూరల్: ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణ పనులు చేపట్టి ఐదేళ్లు గడిచినా పూర్తికాలేదు. పనుల జాప్యంతో సాగునీరు అందక పంటలు సాగు కావడం లేదు. దీంతో ఆయకట్టు రైతులు మనోవేదన చెందుతున్నారు. మూతపడ్డ ఎత్తిపోతల పథకాల(లిఫ్ట్)ల పునరుద్ధరణకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. జిల్లాలో మొత్తం 111 ఎత్తిపోతల పథకాలు ఉండగా, 21 పనిచేయడంలేదు. మరో ఐదు మూతపడ్డాయి. కొన్ని పథకాలు పనిచేస్తున్నాయి. 2018–19 సంవత్సరంలో జిల్లాలో మూడు లిఫ్ట్‌లకు రూ. 29.64 కోట్లు మంజూరు చేసింది. ఇందులో చర్ల మండలం పెదమిడిసిలేరు వద్ద లిఫ్ట్‌ను రూ.9.31 కోట్లతో పునరుద్ధరణ చేపట్టారు. పాల్వంచ మండలం నాగారం ఎత్తిపోతల పథకానికి రూ.14 కోట్లు, సూరారం ఎత్తిపోతల పథకానికి రూ.6.33 కోట్లు మంజూరు చేశారు. కానీ పనులు ఇప్పటివరకు పూర్తికాలేదు.

నాగారంలో అసంపూర్తిగా..

పాల్వంచ మండలం జగన్నాథపురం సమీపంలో కిన్నెరసాని వాగుపై రూ. 30 లక్షలతో 1978లో నాగారం లిఫ్ట్ నిర్మించారు. జగన్నాథపురం, రంగాపురం, నాగారం, సంగం, నారాయణరావుపేట గ్రామాల పరిధిలో 1,808 ఎకరాలకు సాగునీరు అందించారు. కిన్నెరసాని వాగులో బూడిద మేట వేయడంతో లిఫ్ట్ మరమ్మతులకు గురైంది. పలుమార్లు మరమ్మతులు నిర్వహించి సాగునీరు అందించారు. 1981లో పథకం పూర్తిగా నడపలేని పరిస్థితి తలెత్తడంతో మూతపడింది. ఆయకట్టు రైతుల విన్నపంతో రూ.18 లక్షలతో మరమ్మతులు చేపట్టినా రైతులకు ఉపయోగపడలేదు. ఆ తర్వాత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. 2019లో ప్రభుత్వం లిఫ్ట్‌ల పునరుద్ధరణకు రూ. 14 కోట్లు మంజూరు చేయగా, పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కిన్నెరసాని వాగు ఒడ్డున పాత లిఫ్ట్ సమీపంలో ఓ బావిని తవ్వి అసంపూర్తిగా వదిలేశారు. పైపులైన్ కోసం కాల్వ నిర్మించి వదిలేశారు. ప్రస్తుతం ఆ కాల్వలు కూడా పూడుకుపోయాయి. కొంత దూరం పైపులైన్ వేశారు. లిఫ్ట్ కోసం తెచ్చిన పైపులు బీసీఎం ప్రధాన రహదారి పక్కన పడవేశారు. అటవీశాఖ అభ్యంతరాలతో పనులు నిలిచిపోయాయి. పిల్ల కాల్వలు నిర్మించాల్సి ఉంది.

సూరారంలో పైపులైన్ నిర్మించలే..

సూరారం గ్రామ సమీపంలోని మూతపడ్డ లిఫ్ట్ పునరుద్ధరణ పనుల్లో కూడా తీవ్ర జాప్యం చేస్తున్నారు. 1986లో లిఫ్ట్ నిర్మాణం చేపట్టారు. సూరారం, బిక్కుతండా, కమ్మరిగూడెం, సోములగూడెం గ్రామాల పరిధిలో 970 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందింది. కిన్నెరసాని వాగు ఒడ్డున కట్టిన లిఫ్ట్‌తో పలువురు రైతులు లబ్ధిపొందారు. కానీ బూడిదనీరు కిన్నెరసాని వాగులో ప్రవహించడంతో లిఫ్ట్ పనిచేయకుండా పోయింది. 2019లో పునరుద్ధరణ కోసం రూ.6.33 కోట్లు మంజూరు చేశారు. టెండర్ల ద్వారా పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ ప్రధాన పైపులైన్ పనులు మాత్రం పూర్తిచేశారు. ఇంకా 9 కిలోమీటర్ల మేర పైపులైన్ కాల్వ నిర్మించాల్సి ఉంది. పంపుహౌస్, మైనర్ పనులు నిర్వహించాల్సి ఉన్నా చేపట్టడం లేదు. ఇక నాగారం లిఫ్ట్ కింద 14 కిలోమీటర్ల మేర కాల్వ నిర్మించాల్సి ఉంది.

పనులు కొనసాగుతున్నాయి



సూరారం, నాగారం లిఫ్ట్ నిర్మాణ పనులు గతేడాదే పూర్తికావాల్సి ఉంది. పనుల్లో జాప్యంపై సంబంధిత కాంట్రాక్టర్‌కు రెండు సార్లు నోటీసులు జారీ చేశాం. అయినా స్పందించకపోవడంతో మరో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాం.
– బి.అర్జున్, జలవనరులశాఖ ఈఈ

నత్తనడకన సాగుతున్నాయి...



నాగారం లిఫ్ట్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈఏడాది పూర్తయ్యే పరిస్థితి కన్పించడం లేదు. పైపులైన్ నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేసి సాగునీరు అందించాలి. పనులు పూర్తయితే రెండు పంటలకు సాగునీరు అందుతుంది.
–బాదర్ల నాగేశ్వరరావు, జగన్నాథపురం, రైతు

త్వరితగతిన పూర్తి చేయాలి



సూరారం లిఫ్ట్ పునరుద్ధరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. పంపుహౌస్, మైనర్ కాల్వల పనులు చేపట్టాల్సి ఉంది. ఈ పనులు కూడా పూర్తి చేసి భూములకు సాగునీరు అందించాలి. లిఫ్ట్ కింద మాకు రెండెకరాలు ఉంది. నీళ్లు లేకపోవడంతో పంటలు పండటం లేదు. –పి. సందీప్, సూరారం

నీటి చుక్క నిలవక..

మైదానాన్ని తలపిస్తున్న పెదవాగు ప్రాజెక్ట్

ఏటా వానాకాలం సీజన్‌లో సాగునీటితో నిండే పెదవాగు ప్రాజెక్ట్ ఈ ఏడాది మాత్రం పచ్చదనం పర్చుకుంది. గతేడాది జూలై 18న కురిసిన భారీ వర్షాలతో అశ్వారావుపేట మండలంలోని గుమ్మడవల్లివద్ద ఉన్న ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఆనకట్టకు భారీ గండి పడి కోతకు గురైంది. ఈ ఏడాది వానాకాలం సీజన్‌కు ముందే ప్రాజెక్ట్‌ను తిరిగి నిర్మిస్తామని పాలకులు హామీ ఇచ్చారు. వరద ఉధృతికి ఆనకట్ట కొట్టుకుపోయినట్లే ఆ హామీ కూడా కొట్టుకుపోయి గోదారిలో కలిసింది. దీంతో ప్రాజెక్ట్‌లో సాగునీరు నిలవక పచ్చదనంతో నిండి క్రికెట్ మైదానంలా కనిపిస్తోంది. కాగా ఆయకట్టు రైతులు సాగునీటి కోసం మనోవేదన చెందుతున్నారు.
–అశ్వారావుపేటరూరల్



ప్రస్తుతం పచ్చదనం నిండిన ప్రాజెక్ట్ (ఇన్‌సెట్) గతేడాది జూన్ నెలాఖరులో కళకళలాడుతున్న పెదవాగు ప్రాజెక్ట్

క్లుప్తంగా

బీటెక్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా కార్మికులు, ఉద్యోగుల పిల్లలు బీటెక్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏరియా జీఎం వీసం కృష్ణయ్య తెలిపారు. ఆదివారం జీఎం కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ మంథని, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కొత్తగూడెం(కేయూ)లో ఖాళీలు ఉన్నాయని, ఇందులో మంథిని కాలేజ్‌లో అధికారు ల పిల్లలకు 18 సీట్లు, కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 10 సీట్లు ఉన్నట్లు తెలిపారు. మైనింగ్ ఇంజనీరింగ్‌లో సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, కేయూ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ మైనింగ్ కొత్తగూడెం మైనింగ్ ఇంజనీరింగ్‌లో సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఎంసెట్‌లో ఉత్తీర్ణులైన వారు, హాల్ టికెట్, ర్యాంక్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కార్మికవర్గ ఐక్యతే ఎస్‌డబ్ల్యూఎఫ్ లక్ష్యం

ఖమ్మంమయూరిసెంటర్ : ఆర్టీసీ కార్మికుల ఐక్యతకు వారధిగా.. పోరాటాల సారథిగా, కార్మిక వర్గ ఐక్యతే లక్ష్యంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ పని చేస్తుందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. ఖమ్మం ఐఎంఏ హాల్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. కార్మికులు ఐక్యంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ఆర్టీసీ కార్మికులకు నష్టం కలిగించే ప్రభుత్వ, యాజమాన్య విధానాలకు వ్యతిరేకంగా పోరాడే సంఘం ఎస్‌డబ్ల్యూఎఫ్ ఒక్కటేనని చెప్పారు. ఆర్టీసీని పరిరక్షించేది ఐక్య పోరాటమేనని పిలుపునిచ్చారు. కార్మికులు అనుభవిస్తున్న కష్టాలు, ఆర్టీసీ ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, ఔట్‌సోర్సింగ్ విధానాలు, ఎలక్ట్రికల్ బస్సులు, పెరిగిన పనిభారాలు అన్నీ కూడా ప్రభుత్వాలు అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాల ఫలితమేనని ఆయన విమర్శించారు.

'రాజీవ్ స్వగృహ' సాధనకు కృషి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని గెజిటెడ్ అధికారులకు ఇళ్ల స్థలాలకు బదులు రాజీవ్ స్వగృహ ఫ్లాట్స్ ఇప్పించేలా కృషి చేస్తామని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. ఫ్లాట్స్ కోసం ఇప్పటికే మంత్రులను కలిసి విన్నవించామని తెలిపారు. ఖమ్మంలోని టీజీఓ కార్యాలయంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏలూరి మాట్లాడారు. బ్యాంకు రుణ సదుపాయం కల్పించాలని, హైదరాబాద్ స్థాయిలో గేటెడ్ కమ్యూనిటీ తరహాలో ఖమ్మంలోని గెజిటెడ్ ఉద్యోగులకు సౌకర్యాలు కల్పించాలని కోరినట్లు చెప్పారు. హౌసింగ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కట్టా కిషోర్, పి.విజయ్‌కుమార్, టీజీఓ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, వేలాద్రి, టీజేఏసీ జిల్లా చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి కొణిదన శ్రీనివాస్ పాల్గొన్నారు.

డ(ద)యాలసిస్ సేవలు..!

- గుండాలలో డయాలసిస్ కేంద్రానికి ప్రతిపాదనలు
- 20 రోజుల్లో ఏర్పాటు చేసేలా సన్నాహాలు
- పరిశీలన చేసిన ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ టీం
- జిల్లాలో 7 సెంటర్లు.. 53 డయాలసిస్ మిషన్లు



గుండాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఇల్లెందు: జిల్లాలో మారుమూల మండలమైన గుండాల మండల కేంద్రంలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలతో కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచనతో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జి.రవిబాబు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈనేపథ్యాన గుండాల పీహెచ్‌సీలో 20 రోజుల్లో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు కానుంది.

పీహెచ్‌సీ పరిశీలన..

గత మేలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు జిల్లా కలెక్టర్‌కు లేఖ రాయగా.. ఆయన సూచనతో డీసీహెచ్‌ఎస్ ఐదు పడకల డయాలసిస్ కేంద్రం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదించారు. రెండు రోజుల క్రితం ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ టీం సభ్యులు గుండాల పీహెచ్‌సీని సందర్శించి అక్కడున్న సదుపాయాలను పరిశీలించారు. ఈక్రమంలో 21న గుండాల మండలానికి వచ్చిన మంత్రి పొంగులేటి దృష్టికి మండల ప్రజలు సమస్యను తీసుకెళ్లడంతో.. ఇప్పటికే ఐదు పడకలతో ప్రతిపాదనలు ఉండగా.. మంత్రి నుంచి ఆదేశాలు రావడంతో మరింత వేగంగా పూర్తయ్యే అవకాశం ఉంది.

త్వరలో అందుబాటులోకి..

గుండాల మండలంలో సుమారు 30 వేల జనాభా కలిగి ఉంది. గుండాల–ఇల్లెందు, గుండాల– మణుగూరు, గుండాల– ములుగు, గుండాల–నర్సంపేటలు ఒకదానికొకటి కనీసం 70కిలోమీటర్ల నుంచి 75 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. కాగా, గుండాల మండలంలో 75 మంది వరకు డయాలసిస్ బాధితులు ఉన్నారు. వీరంతా డయాలసిస్ కోసం సమీప పట్టణానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతుండగా.. గుర్తించిన ఎమ్మెల్యే కలెక్టర్‌తో చర్చించి డీసీహెచ్‌ఎస్ ద్వారా ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్, వైద్య ఆరోగ్యశాఖ దృష్టికి తెచ్చారు. ఇక్కడ కేంద్రం ఏర్పాటుకు అన్ని అంశాలు సానుకూలంగా మారాయి.

జిల్లాలో డయాలసిస్ సెంటర్లు, యంత్రాల వివరాలు..

సెంటర్	డయాలసిస్ యంత్రాలు	రోగులు
ఏరియా ఆస్పత్రి ఇల్లెందు	08	32
సీహెచ్‌సీ పాల్వంచ	10	41
ఏరియా ఆస్పత్రి భద్రాచలం	10	60
ఏరియా ఆస్పత్రి మణుగూరు	05	32
సీహెచ్‌సీ చర్ల	05	10
ఏరియా ఆస్పత్రి అశ్వారావుపేట	05	29
జీజీహెచ్ కొత్తగూడెం	10	44
మొత్తం	53	248

జిల్లా పురోభివృద్ధికి దోహదం..

జిల్లాలో ఏడు కేంద్రాల్లో డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేశారు. గుండాల వంటి మారుమూల ప్రాంతం నుంచి డయాలసిస్ కోసం వెళ్లాలంటే ఆర్థికంగా తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. జిల్లాలో ఇల్లెందు, భద్రాచలం, మణుగూరు, అశ్వారావుపేట ఏరియా ఆస్పత్రులు, చర్ల, పాల్వంచ సీహెచ్‌సీలు, కొత్తగూడెం జీజీహెచ్‌లలో డయాలసిస్ సెంటర్లు దిగ్విజయంగా సాగుతున్నాయి.

ప్రతిపాదనలు పంపాం..



గుండాల మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఐదు పడకలతో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. ఆరోగ్య హెల్త్‌కేర్ యూనిట్ టీం సభ్యులు కూడా పరిశీలించారు. మంత్రి, కలెక్టర్ ఆదేశాలతో 20 రోజుల్లో ఏర్పాటు చేసే దిశగా రాష్ట్ర వైద్యారోగ్యశాఖ, ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ దృష్టికి తీసుకెళ్లాం.

– డాక్టర్ జి.రవిబాబు, డీసీహెచ్‌ఎస్

పూర్తయిన పాసేజ్ పిల్లర్ నిర్మాణం

- పిల్లర్ పటిష్టతపై అధికారుల ఆరా
- కొనసాగుతున్న లైనింగ్ పనులు


నూతనంగా నిర్మించిన పిల్లర్


కొనసాగుతున్న కాంక్రీట్ లైనింగ్ పనులు

ములకలపల్లి: సీతారామ ఎత్తిపోతల పథకం (ఎస్‌ఆర్‌ఎల్‌ఐపీ) ప్రాజెక్ట్ ప్రధాన కాల్వపై నిర్మించిన సూపర్ పాసేజ్ పిల్లర్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మండలపరిధిలో 48.30 కి.మీ వద్ద ఎగువ భాగంలో వరద నీటిని ప్రధాన కాల్వ దాటేందుకు రూ.కోటి వ్యయంతో సూపర్‌పాసేజ్ నిర్మించారు. అయితే పాసేజ్ ఎడమ వైపు పిల్లర్ (వీకే రామవరం శివారులో గల పంప్‌హౌస్–2 నుంచి పంప్‌హౌస్ –3 కమలాపురంకు వెళ్లే దారిలో) కూలిపోయిన విషయం విదితమే. ఈ విషయమై పత్రికల్లో కథనాలు రావడంతో ప్రభుత్వం ప్రత్యేకంగా విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యాన మెయిన్ కెనాల్ నిర్మించిన ఏజెన్సీతో నూతన పిల్లర్ నిర్మిస్తామని ఇరిగేషన్ అధికారులు ప్రకటించారు. ఈక్రమంలో దిద్దుబాటు చర్యలు ఆరంభించారు.

గత రెండు నెలల నుంచి..

గత రెండు నెలలుగా పిల్లర్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇవి గత పది రోజుల క్రితం పూర్తయ్యాయి. దీంతో పాసేజ్‌కు సపోర్ట్‌గా వేసిన ఐరన్ రాడ్లను పూర్తిగా తొలగిస్తున్నారు. ఇదిలా ఉండగా, భూమిపొరల్లో కదలిక వల్ల నిర్మించిన నాలుగేళ్లలోనే ఎడమ పిల్లర్ కూలిన నేపథ్యాన సంబంధిత శాఖ అధికారులు మరింత పటిష్ట చర్యలకు ఉపక్రమించారు. వర్షపు నీరు భూమిలోకి ఇంకిపోకుండా నేరుగా ప్రధాన కాలువలోకి వెళ్లేందుకు కాంక్రీట్ లైనింగ్ వేస్తున్నారు. కూలిన పిల్లర్‌కు ఎదురుగా గల కుడివైపు పిల్లర్ పటిష్టతపై కూడా దృష్టి సారించారు. ఈ పిల్లర్ చుట్టూ కాంక్రీట్‌లైనింగ్ వేస్తున్నారు. నూతనంగా నిర్మించిన పిల్లర్ చుట్టూ కూడా లైనింగ్ పనులు చేపట్టనున్నట్లు నీటిపారుదలశాఖ ఈఈ అర్జున్ తెలిపారు.

ఆదర్శవంతంగా ఏదులాపురం


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన అధికారులు, నాయకులు

- మున్సిపాలిటీ పరిధిలోని అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ

ఖమ్మంరూరల్ : నూతనంగా ఏర్పాటైన ఏదులాపురం మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు రహదారుల నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ఏడాదిన్నర కాలంగా ప్రభుత్వం పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తూ, ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ పాలన కొనసాగిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పథకాలను అందిస్తున్నామని, తద్వారా పేదలు ఆనందంగా ఉన్నారని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇళ్లు ఇచ్చి తీరుతామని హామీ ఇచ్చారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేయడం చారిత్రక నిర్ణయమని, ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి పథకం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ యాకోబ్, ఈఈ యుగంధర్, ఆర్డీఓ నర్సింహారావు, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్ : నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో రెండు రోజులుగా జరుగుతున్న జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ ఆదివారం ముగిసింది. 35 ప్లస్ పురుషుల కేటగిరీ సింగిల్స్‌లో శ్రీను, ఎం.సన్ని, డబుల్స్‌లో నూతన్‌రాజ్, గోపాల కృష్ణ జోడి ప్రథమ స్థానంలో నిలువగా, ఎం.నరేష్, శ్రీను ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. 40 ప్లస్ సింగిల్స్‌లో బి.మంగిత్యా, ఈ.శ్రీనివాస్, డబుల్స్‌లో నివాస్‌రెడ్డి, ఈ.శ్రీనివాస్, సంజయ్‌రెడ్డి, సత్యం, 45 ప్లస్ సింగిల్స్‌లో వై.నర్సింహారెడ్డి, రామ్‌చందర్, డబుల్స్‌లో ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, వై.పాపారావు, ఎండి.పర్వేజ్, రామచందర్, 50 ప్లస్ సింగిల్స్‌లో పి.వెంకటేశ్వరరావు, రవి, డబుల్స్‌లో టి.లక్ష్మణ్‌రావు, సైదులు, జె.శ్రీనివాస్, సూరి, 55 ప్లస్ సింగిల్స్‌లో ఎ.సురేష్‌కుమార్, లక్ష్మణ్‌రావు, డబుల్స్‌లో సీహెచ్, నాగుల్, రవి, వి.చందు, పి.శ్రీనివాస్, 60 ప్లస్ సింగిల్స్‌లో ఎస్.రఘు, ఎస్.వెంకటేశ్వర్లు, డబుల్స్‌లో ఎస్.వెంకటేవ్వర్లు, ఎ.వీరభద్రం, కె.వెంకటేశ్వర్లు, ఎస్.డి.ఖాజామోయినోద్దీన్, 65 ప్లస్ సింగిల్స్‌లో బి.కోటేశ్వరరావు, రమేష్, 70 ప్లస్ సింగిల్స్‌లో పి.సత్యనారాయణరావు, పి.భాస్కర్‌రావు, డబుల్స్‌లో పి.భాస్కర్‌రావు, ఎ.సత్యనారాయణ, ఎస్. వెంకటేశ్వరరావు, నర్సింహారావు, 75 ప్లస్ సింగిల్స్‌లో కె.నర్సయ్య, జి.కిషన్‌రావు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు అడిషనల్ ఎస్పీ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ జి.వెంకట్రావు, అధ్యక్షుడు కర్నాటి వీరభద్రం, ఉపాధ్యక్షులు దుద్దుకూరి సత్యనారాయణ, కార్యదర్శి వి.చంద్రశేఖర్, మాజీ అధ్యక్షులు సిరిపురపు సుదర్శన్‌రావు, పాటిబండ్ల యుగంధర్ బహుమతులు అందజేశారు.

నల్లబెల్లం, పటిక స్వాధీనం


పట్టుబడిన సరుకు, వ్యక్తులతో ఎక్సైజ్ అధికారులు

పాల్వంచ: నాటు సారా తయారీ కోసం నల్లబెల్లం, పటిక తరలిస్తున్న బొలేరో వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీసీజీ.జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం పట్టణంలోని దమ్మపేట సెంటర్‌లో వాహన తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో బొలేరో వాహనాన్ని ఆపి తనిఖీచేయగా.. 4,025కేజీల నల్లబెల్లం, 20 కేజీల పటిక,10లీటర్ల నాటుసారా,2 సెల్‌ఫోన్లు ఉన్న ట్లు గుర్తించి స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని పాల్వంచలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో అప్పగించారు. తనిఖీల్లో ఎస్‌ఐ సీహెచ్.శ్రీహరిరావు, హెడ్ కానిస్టేబుల్ కరీం, కానిస్టేబుళ్లు వెంకట్, హరీష్, వీరబాబు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. మత్తుపదార్థాల రవాణా, వినియోగంపై ఏదైనా సమాచారం ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 18004252523 సంప్రదించాలని కోరారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

జూలూరుపాడు:పురుగు మందు తాగి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ బాదావత్ రవి తెలిపిన వివరాల ప్రకారం.. పాపకొల్లు రెవెన్యూ పరిధి వెనకతండాకు చెందిన కళావతి(32)కి, జూలూరుపాడుకు చెందిన షేక్ అన్వర్‌ను ప్రేమ వివాహం కాగా వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇద్దరి మతాలు వేర్వేరు కావడంతో అన్వర్ తన భార్యను కులం పేరుతో దూషిస్తూ, అనుమానంతో చిత్రహింసలకు గురి చేసేవాడు. అయినా ఓపికతో ఉంటునా భర్తలో మార్పు రాకపోగా ఈనెల 19న భార్యను అక్రమ సంబంధంపై అనుమానించి, పురుగు మందుల డబ్బా ఇచ్చి ఇంటి తలుపులు మూసివేసి బయటకు వెళ్లాడు. కొద్దిసేపటికి అన్వర్ తల్లి తలుపులు తీసి చూడగా.. కళావతి అపస్మారకస్థితిలో పడి ఉండడాన్ని గమనించి చుట్టుపక్కల వారి సాయంతో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. అయినా ఫలితం లేకపోవడంతో ఆదివారం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో (తల్లాడ వద్ద) మృతి చెందింది. మృతురాలి తండ్రి ధరావత్ సామ్యా అన్వర్ పెట్టే చిత్రహింసల వల్లే మృతిచెందిందని ఫిర్యాదు చేయడంతో అతడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

అత్త ఇంటి ఎదుట కోడలు నిరసన

తాళం వేసి పరారైన భర్త, అత్త


నిరసన తెలుపుతున్న శ్రావణి

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలోని గాంధీబొమ్మ సెంటర్‌లో ఓ వివాహిత తన కొడుకుతో సహా అత్త ఇంటి ఎదుట నిరసనకు దిగింది. శనివారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలను బాధితురాలు ఇలా తెలిపింది. మున్సిపాలిటీకి చెందిన బూర రవితేజకు కొన్నాళ్ల క్రితం పగిడేరుకు చెందిన శ్రావణికి వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో వారిమధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో మూడేళ్లుగా దూరంగా ఉంటున్నారు. శ్రావణి పుట్టింటికి వెళ్లిపోగా.. పిల్లల్లో ఒకరు తల్లి దగ్గర, మరొకరు తండ్రి వద్ద ఉంటున్నారు. ఈ క్రమంలో తన భర్త మరో కొడుకును తన నుంచి దూరం చేస్తున్నాడని, మానసికంగా వేధిస్తూ విడాకులు ఇస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నాడని వివాహిత ఆరోపించింది. తనకు న్యాయం చేయాలని తన కొడుకును తనకివ్వాలని కోరుతూ.. శనివారం అర్ధరాత్రి గాంధీబొమ్మ సెంటర్‌లోని అత్త ఇంటి వద్ద నిరసనకు దిగింది. దీంతో ఆమె అత్త, భర్త ఇంటికి తాళాలు వేసుకుని వెళ్లిపోయారు.

హత్య కేసు నమోదు

దుమ్ముగూడెం: భూ సరిహద్దు తగాదాల వల్ల ఓ వ్యక్తి మృతిచెందాడు. సీఐ అశోక్ కథనం ప్రకారం.. మండలంలోని గోవిందాపురం గ్రామానికి చెందిన సవలం మల్లేష్, సవలం నాగేశ్వరరావుల మధ్య గత కొంతకాలంగా భూమి సరిహద్దు విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి మల్లేష్‌పై నాగేశ్వరరావు కత్తితో దాడి చేయగా తీవ్రగాయాలు కావడంతో.. భద్రాచలం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మృతుడి భార్య అలివేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా, వీరిద్దరూ సొంత అన్నదమ్ముల పిల్లలు. హంతకుడు నాగేశ్వరరావు పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుని కోర్టులో హాజరుపర్చుతామని పేర్కొన్నారు.

నగదు చోరీ..


పట్టుబడిన నిందితులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం శ్రీసీతా రామచంద్ర స్వామి వారిని దర్శించుకునేందుకు వరంగల్ జిల్లా తొర్రూరు నుంచి ఓ వాహనంలో 20 మంది భక్తులు ఆదివారం ఉదయం భద్రాచలంకు వచ్చారు. ఈ క్రమంలో ముందుగా గోదావరిలో స్నానం చేసేందుకు కరకట్ట కింద వరకు వాహనంలో వెళ్లి తమ వాహనాన్ని అక్కడే నిలిపి అందరూ అందులోకి దిగారు. వీరిని గమనించి ఇద్దరూ దొంగలు సదరు వాహనంలోకి ప్రవేశించి నగదు చోరీ చేసి కిందకు దిగే సమయాన స్థానికులు గుర్తించి పట్టుకుని సదరు భక్తులను పిలిచారు. వెంటనే వారు అక్కడకు చేరుకుని తమ వద్ద ఉండాల్సిన నగదు రూ.30వేలు లేకపోవడంతో పట్టుబడిన దొంగల జేబులు వెతకగా రూ.30వేలతో పాటు మరో రూ.1,700 లభించాయి. ఈ క్రమంలో స్థానికులు భద్రాచలం టౌన్ సీఐ నాగరాజుకు సమాచారం ఇవ్వగా.. వారు ఆ దొంగలను స్టేషన్‌కు తరలించారు. ఇద్దరు దొంగలపై ఇదివరకే రెండు కేసులు ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు.

ఇక నిశ్చింతగా ఉండేలా..

ఒకప్పుడు తల్లిదండ్రులు తమ పిల్లలను గురుకులాల్లో చేర్పించాక ఇంటిబాట పట్టిన సమయాన వారితో కనీసం మాట్లాడటానికి ఫోన్ కూడా లేదని ఎంతో మదనపడేవారు. అలాగే విద్యార్థులు సైతం తల్లిదండ్రుల సమాచారం కోసం బెంగపడేవారు. కొందరు అక్కడ ఉండలేక ఇంటి బాట పట్టిన సందర్భాలు ఉన్నాయి. అయితే కాలానుగుణంగా ప్రభుత్వం గురుకులాల్లో నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్య, వసతి సౌకర్యం కల్పించి నాణ్యమైన బోధన అందించడంతో పాటు విద్యార్థుల యోగక్షేమాలు, ఇతర విషయాలను తల్లిదండ్రులకు చేరవేసేందుకు ఫోన్‌మిత్ర పేరిట ఫోన్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చి ప్రతీ విద్యార్థికి ఒక కాలింగ్ కార్డు ఇవ్వనుంది.

– నేలకొండపల్లి

'ఫోన్‌మిత్ర' పేరిట గురుకులాల్లో ఫోన్ సౌకర్యం

- ఇందుకు విద్యార్థులకు కాలింగ్ కార్డుల అందజేత
- తీరిన తల్లిదండ్రుల బాధలు
- ఉమ్మడి జిల్లాలో 34 గురుకులాల్లో ఏర్పాటు


గురుకులంలో ఫోన్ మాట్లాడుతున్న విద్యార్థులు

కుటుంబీకులతో మాట్లాడేలా..

ఖమ్మం ఉమ్మడి జిల్లాలో మొత్తం 34 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు ఉండగా వాటిలో 9 బాలుర, 25 బాలికల పాఠశాలలు ఉన్నాయి. అయితే విద్యార్థుల కోసం ప్రభుత్వం ఇటీవల ప్రత్యేకంగా ఫోన్ సౌకర్యాన్ని కల్పించింది. తొలిసారిగా ఇంటిని వదిలి గురుకులాల్లో చేరే వారు ఒత్తిడికి గురవుతుంటారు. ఒంటరిగా ఉన్నామని బాధపడుతుంటారు. వీరి బాధలను గుర్తించిన సంబంధిత అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించి ఫోన్‌మిత్రను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇకనుంచి విద్యార్థులు తమ తల్లిదండ్రులతో ఎప్పుడైనా మాట్లాడే అవకాశం ఉండనుంది.


ప్రతీ విద్యార్థికి కాలింగ్ కార్డు..

ప్రతీ సాంఘీక సంక్షేమ గురుకులాల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టెలిఫోన్ బాక్స్‌లను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు కాలింగ్ కార్డులను కేటాయించారు. దీని ద్వారా ముందుగా నమోదు చేసుకున్న తల్లిదండ్రులు, సంరక్షకులకు ఉచితంగా కాల్స్ చేసుకుని వారు ఉంటున్న విధానాలను సులువుగా చెప్పుకోవచ్చు. అంతేకాక దూర ప్రాంతాల నుంచి వచ్చి గురుకులాల్లో ఉంటున్న పిల్లల యోగక్షేమాలను సులభంగా తెలుసుకోవచ్చు.

అధికారుల దృష్టికి..

గురుకులాలలో ఏర్పాటు చేసిన ఫోన్ సౌకర్యం కేవలం ఫోన్ చేసుకోవడానికే కాదు.. విద్యార్థులకు ఒక సైకాలాజికల్ సేఫ్టీ నెట్‌గా ఉపయోగపడనుంది. కార్డులో ఏఐ ఆధారిత చాట్ బాక్స్‌తో ఉన్న నంబర్ ఆధారంగా ఏమైనా సమస్యలు, ఫిర్యాదులు, సూచనలు ఉంటే సంబంధిత అధికారికి నేరుగా సందేశం పంపవచ్చు. లేదంటే సొసైటీ ప్రధాన కార్యాలయంలోని కాల్ సెంటర్‌కు ఫోన్ వెళ్తుంది. తద్వారా సమస్యలు సులభంగా పరిష్కరించుకోవచ్చు.


విద్యార్థుల శ్రేయస్సు కోసం..



ఇంటికి దూరంగా ఉంటున్న విద్యార్థులకు ఇంట్లో ఉన్న అనుభూతిని కల్పించడమే ఫోన్‌మిత్ర ఉద్దేశం. దీనిద్వారా తల్లిదండ్రులతో మాట్లాడే అవకాశం కల్పించాం. భవిష్యత్‌తో విద్యార్థుల శ్రేయస్సు కోసం మరిన్ని వినూత్న కార్యక్రమాలు చేపట్టనున్నాం.

– స్వరూపరాణి, గురుకులాల జోనల్ అధికారి, భద్రాద్రి కొత్తగూడెంజోన్


చాలా బాగుంది..



ఫోన్‌మిత్ర సౌకర్యం చాలా బాగుంది. ఇక్కడ చేరిన కొత్తలో ఇంటికి దూరంగా ఉంటూ కుటుంబసభ్యులతో మాట్లాడలేకపోతున్నామని బెంగగా ఉండేది. ఇప్పుడది లేదు. మా చదువు, వసతులు, ఇతర సమాచారాన్ని సులువుగా మా పేరెంట్స్‌కు చెప్పగలుతున్నాం.

– సీహెచ్.సాహితీ, విద్యార్థిని, నేలకొండపల్లి గురుకుల పాఠశాల

ఇక బెంగలేదు..



గురుకులాల్లో ఉంటున్న మా పిల్లల సమాచారం తెలుసుకునేందుకు గతంలో ఇబ్బంది పడ్డాం. ఇప్పుడు ఆ బాధ, భయం లేదు. ఎప్పటికప్పుడు వారి యోగక్షేమాలు, చదువు విషయాలను తెలుసుకుంటున్నాం. మా పిల్లలు అవసరమైనప్పుడు ఫోన్ చేస్తున్నారు.

– బి.నాగరాణి, విద్యార్థిని తల్లి, కోనాయిగూడెం